# సంధి

రచన: శ్రీ. కె. పి. బాబు

వేసవికాలం...ఓ సాయంసమయంలో 'సంజెదీపం' వెలిగించి, సూర్యకాంతం అలవాటుచొప్పున సన్నగా ప్రారంభించింది, ప్రార్థన. "దీపంజ్యోతి పరబ్రహ్మం... అంటూ, భక్తిశ్రద్ధలతో చేతులు జోడించి, కనులు మూసుకొని ప్రార్థిస్తున్న ఆమెకు 'గుప్పున సెంటువాసన తగిలి చట్టున ప్రక్కకి తిరిగి చూచింది.

రమణయ్య దొంగ తనంగా గదిలోకి వచ్చి ఆమె ప్రక్కన చేరి ఆడించాలని, దొరికిపోయాడు. సూర్యకాంతం కళ్లుతెరిచి తన్ను చూడగానే మందహాసంతో, సూర్యకాంతి ముందు సంజెదీప మేమూలకో చూస్తున్నాను! అన్నాడు.

సూర్యకాంతం నవ్వాపుకొంటూ "అదిసరే గాని, ఈ వేళ మీసాలకి సంపెంగి నూనె రాసినట్లున్నావే!' అనడిగింది.

'అంటే—మింగ మెతుకుల్లేని వాడిననేగా నీ వుద్దేశం?' అని రమణయ్య మాట ముగించే లోపునే, ఇంట్లోనుండి వచ్చింది పున్నమ్మగారు. రమణయ్య చివరిమాటలు మాత్రమే విన్పించి, అమ్మాయి మళ్లీ అతన్ని ఏదో అనేసివుంటుందని "ఏమిటేవ్, రోజు రోజుకీ నీ బుద్ధి మరీ ఇలా పోతుందే," అని మందలించింది:

'అదేమీ లేదమ్మా, సూర్యం అన్నదాంట్లో అబద్ధమేముందిలే! ఇప్పుడు సైతం నేనొచ్చింది మీ దగ్గర భోంచెయ్యాలనే గదా!" అని నవ్వుతూ, "పదమ్మా, త్వరగా పెట్టాలి నేను వెంటనే స్టేషన్‌కి పోవాలి మళ్లీను" అన్నాడు,

లేకపోతే అభిమానంతో పస్తులుపండుకొనే వారిని చూస్తే చీదరించుకొనే స్వభావంగల పున్నమ్మగారు "రా నాయనా, ఇలా అడిగి పెట్టించుకు తినేవాళ్లంటే నాకెంతో కడుపు నిండుగా వుంటుంది, రా" అని లోనికి పోయింది.

కొంచెం ప్రొద్దు పోయాక తినే అలవాటు గలవాళ్లు కనుక, పున్నమ్మగారు అప్పుడే వంట చేస్తూవుంది. ఇక ఆపని సూర్యకాంతానికి అప్పగించి, తానేమో రమణయ్యకి పీటవేసి. విస్తరివేసింది. వాళ్లకి వంటగదీ, భోజనాలగదీ ఒకటే కనుక, కబుర్లకి ఎవరికీ ఏ ఇబ్బందీ కలుగలేదు.

"ఇదిగో నబ్బాయ్, అర్జంటర్జంటంటున్నావు కనుక, నీకీ పూట పచ్చడి మెతుకులే గతి! కూరా నారా లేకుండా పెట్టానని మళ్లీ ఎక్కడన్నా అన్నావా?... చూస్కో మరి, నే నసలే తిక్కదాన్ని? అన్నది పున్నమ్మగారు చిరునవ్వుతో.

రమణయ్య నవ్వి "మీ అమ్మాయిని అన్నానే గాని, నీవూ అంతే నమ్మా!" అన్నాడు.

"ఏం"

"ఇదిగో, క్రొత్త బట్ట వేసుకువస్తుంటే, ఒక స్నేహితుడు పిల్చి మరీ సెంటు కాస్తరాచాడు. అది చూచి మీ అమ్మాయి చటుక్కున అనేశిందో మాట! ఇప్పుడేమో నేనేమనుకొనేది ఊహించేసినట్లు నీవేమో పుసిక్కున నన్ను డబ్బాగాడి క్రింద జమ చేసి మాటల స్తున్నావ్!'

"అయ్యో, అయ్యో! నీ అఘాయిత్యం కూల! నేనలాగన్నానా?" అని నోరు నొక్కుకొందామె.

రమణయ్య మళ్లీ నవ్వాడు "అదే నేననేది. మీ రనుకోకుండానే ఏదో ఒకటి అనేస్తారు కాని, అది ఇతరులకే అర్థం కల్గిస్తుందో ఆలోచించరు. మీ అమ్మాయి అన్నమాట నాకు మింగ మెతుక్కల్లేవనీ, నీ విప్పుడన్నది నే నొట్టి డబ్బాగాడిననే చెప్తాయి మరి." అన్నాడు.

"ఊరుకోవయ్యా, నీతో ఏదన్నా చిక్కే," అని ప్రస్తాపన మార్చేశింది పున్నమ్మగారు. వేడివేడి అన్నం వడ్డించి, క్రొత్త ఆవకాయా, తయారుగావున్న ముద్దపప్పూ వడ్డించి ఇంత నేయి వేసింది. ఈలోగానే సూర్యకాంతం నిప్పుల పొయ్యిమీద వేయించి ఇన్ని అప్పడప్పాలు అందించింది.

"నీ వెంగ గానమ్మా!— మీ ఇంట్లో ఈ ఆవకాయా, నెయ్యీ, పెరుగులతో ఈ ప్రాంతాల్లో ఎవరి కూరా నారా సాటి వస్తాయని?!" అన్నాడు, రమణయ్య భోజనం చేస్తూ.

"ఈ మాటలు ఇక్కడేనా, లేక—" అని ఏదో అన బోయింది, సూర్యకాంతం, చల్ల చారు తయారు చేస్తూ.

"అదిగో, చూస్తున్నావా అమ్మా!— ఆ ఘోరం కనే కూడదని నెత్తీనోరు కొట్టుకొనేది" అన్నాడు రమణయ్య.

పున్నమ్మగారోసారి మందహాసం చేసి, రమణయ్యని ఎగాదిగా చూస్తూ నిల్చుంది.

నున్నగా దువ్విన వంకీలుజుట్టు. చిన్న అందంగా మెలితిప్పిన కోరమీసాలు, శుభ్రంగా ఉతికిన కోరా ఖద్దరు లాల్చీ—ఖద్దరు పంచె, చేతిగోళ్లకి రంగు, బట్టల నుండీ, తలనుండీ — సెంట్, హేరాయిల్ వాసనలు.

"ఏమిటి విశేషం రమణ బాబూ! చాలకాలానికి వేయక వేయక ఇవాళ సరికొత్త వేషం వేశావ్?" అన్డిగింది.

"కుర్ర పెత్తనంగాడిలా తయారయ్యాడు అచ్చం!" అని వ్యాఖ్యానించింది, సూర్యకాంతం ఎగతాళిగాను.

రమణయ్య తన్ను తానొక్కసారి పరీక్షించుకొని, "సూర్యం చెప్పింది నిజమే నమ్మా! ఓ పెళ్లి పెద్దరికానికి విధిగా పోవాల్సి వచ్చింది, ఇప్పుడే మెయిల్లో పోవాలి".

మీకు తెలీదులే, ప్రకాశరావని ఒకడున్నాడు, నెల్లూర్లో! నాకు బాగా స్నేహం. బ్రతకలేక బడి పంతులయ్యాడు, కృపావతి అని ఓ పంతులమ్మని చేసుకొంటున్నాడు...ఎల్లుండే పెళ్లి—" అన్నాడు,

"ఎవరూ? కిరస్తానీ మేళంలాగుందే!" అన్నది పున్నమ్మగారు.

రమణబాబు చిలిపిగాచూస్తూ, "ఆ అమ్మాయి క్రిస్టియనే! వాడు మాత్రం మీ కులంవాడే!" అన్నాడు.

"అయ్యో, అదేం ఖర్మ?"

"ఖర్మో, గ్రహచారమో నాకేమీ తెలియదు. ఆ అమ్మాయికి పెళ్లీడొచ్చింది. వాడికీను! వాళ్లిద్దరూ స్నేహితులు కూడాను. ఇతర్లని చేసుకొంటే ఏ మనుభవిస్తారో గాని, ఈ కష్టకాలంలో వాళ్లిద్దరూ దంపతులైతే మాత్రం అన్ని విధాలా సుఖిస్తారు. ఖాయమని సలహాయిచ్చాను," అన్నాడు రమణయ్య.

పున్నమ్మగారు చకితురాలైంది. "ఆరి నీ అమ్మకడుపు కాల! ఈ వర్ణసంకరపు పనులూ ప్రారంభించావన్న మాట! రామ—రామ—" అన్నది.

"అయితే, ఇక నాకిక్కడ పచ్చి మంచి నీళ్లయినా పుట్టవా, కొంపదీసి? అయితే, ఇదిగో నేనిప్పుడే లేస్తున్నాను" అన్నాడు, రమణయ్య తమాషా గాను.

చప్పున చల్లారి పోయింది పున్నమ్మగారు. "మరీ అఘాయిత్యపడిపై పోతున్నావు సుమా! ఎంతైనా ఆ మాత్రం నీతీ జాతీ లేకంటే ఎట్లా? నీవే చెప్పు బాబూ!" అన్నది లాలనగా.

"ఇది చెప్పవమ్మా ముందు—వాడికి వెనుక పెద్ద కుటుంబంవుంది. ఉండాల్సిన బాధలనేకం వున్నాయి. అవి ఎవరూ పరిష్కారం చేయరుగాని, అంతా 'పెద్ద వాడివై పోతున్నావు త్వరగా పెళ్లిచేసేసుకోరా' అనే వాళ్లే! ఆ అమ్మాయికీ అంతే! వాళ్లు ఏ సంపాదనా ఎరుగనివాళ్లని గాని చేసుకొన్నారా, ఇక "తా" రత్తి చచ్చారన్న మాటే! పోతే, ఇద్దరూ 'లవ్వా'డు కొంటున్నారు కూడా ఏనాటి నుండో, వీళ్లిద్దరూ దంపతులైతే తేలిగ్గా చిన్న మేనేజిమెంటు స్కూలు ప్రారంభించుకొని హాయిగా బ్రతగ్గల అవకాశాలున్నాయి. ఇన్నీ ఆలోచించే, చివరకి మనం వాళ్ల కోరిక మీదనే ఈ సలహా వ్రాసి పారేశాం. 'ఈ సంబంధానికి ఎందరు ఎదురు తిరిగి పోతే అంత భారం తగ్గినట్లే—అదీ ఒకందుకు మీ మంచికే అనీ చెప్పేశాను. మన మాటంటే ఆ యిద్దరికీ వేదమే అనుకో..."

"ఇక చాల్లే నీ పాడు నోటితో ఆ పవిత్ర వేదాలనూట చెప్పకు" అన్నది వెటకారంగా, పున్నమ్మగారు.

"అంటే—ఇక ఈ పెళ్లికి తమరే అన్నీ అన్న మాట?" అని అడిగింది సూర్యకాంతం.

"అన్నట్టే ఇక. వాళ్ళు చూస్తే నాకు ఛార్జీలైనా పంపుకోలేని అభాగ్యులు పాపం! అందుకనే, 'నే నెందుకురా, గుప్‌చుప్‌గా అక్కడి స్నేహితులతో జరిపించేసుకోండిరా చాలు' నంటే—కాదుకూడదని ఇద్దరూ పట్టుబట్టి ప్రాధేయ పడ్డారు... పోనీలే! పోయొద్దామనుకొంటే...మన దగ్గిర మాత్రం రైలు ఖర్చులుండి ఏడుస్తాయా?"

"—అంత లేనివాడివేనా. ఇంత వేషం వేశావు?" అని సూటిగా అడిగింది మూలనుండే సూర్యకాంతం.

"అదే చెప్తుంటే, నేనూవున్నానంటూ పొడుచుకొస్తావే - మహా!" అని ఆమెనదలించి రమణయ్య, పున్నమ్మ గారికి చెప్పనారంభించాడు..."జేబులో చిల్లిగవ్వ లేకపోయినా ధీమాగానే కొత్త బట్ట వేసుకొని అలా వీర్రాఘవులింటికి వెళ్లి వాడిని పట్టుకొన్నాను. కథంతా విని కావలసిన ఖర్చులకి డబ్బిచ్చాడు. అక్కడికి సరిపెట్టి నా మానాన్న నన్ను పోనీక 'ఆదేంటిరా, పెళ్లికి పోతూ ఈ రాడీ వేషం?' అంటూ తగులొక్కని తన దగ్గరున్న హేరాయిల్, సెంటూ రాసుకొనే దాకా చంపాడు. ఇన్ని అయ్యాక ఇంకేమిటని గోళ్లకి రంగూ వేసుకొని, మీసామేలూలేసి ఇలా బయల్దేరాను—ఎట్లాగున్నానమ్మా?'

"చెప్పగూడదు. దిష్టి తగుల్తుంది!" అన్నది సూర్యకాంతం.

"ని దిష్టి తగలకుంటే చాలు—సూర్యకాంతకి రోళ్లే బద్దలవుతాయట! అవునామ్మా?" అన్నాడమాయకనిలా.

"వేళాకోళాలూ అవీ సర్లేగాని, నాయనా, వెళ్లేవాడివి ఎలానూ వెళ్తున్నావు—కాస్త ఈ పిల్లదాని విషయమూ తేల్చుకురా బాబూ!" అన్నది పున్నమ్మగారు.

ఆ మాట రాగానే "ఊఁహుఁ!" అని మూతిముడుచుకు లేచింది సూర్యకాంతం. అది చూచి నవ్వుకొన్నాడు రమణబాబు.

"నీకంతా నవ్వుగానే వుంటుందిగాని నాయనా, ఆడపిల్ల ఇంట్లో వున్నవాళ్లకి ఏం బెంగ, ఎన్ని బాధలో నీకింకా అనుభవంలేదు. వెర్రాడివి! చూడు, చిన్నప్పటి నుంచీ దాన్ని చేసుకొంటాం అంటూనే ఇంత కాలం జరిపేసుకొచ్చారు. ఇప్పటికైనా ఏ సంగతీ ఇదమిద్ధమని తేల్చరే! అప్పట్లో అబ్బాయి స్కూల్ ఫైనల్ పాసవ్వాలన్నారు. ఆ తరువాత కాలేజి చదువు పూర్తవ్వాలన్నారు. అన్నీ అయ్యాయి. ఈ సంవత్సరం ఫస్టు క్లాసులో పాసయ్యాడట! కాని, ఈ విషయమే ఎత్తుకోరు. నా కేమో మాదిగులుగా వుంది నాయనా ఉన్నదంతా ధారపోసైనా అయిదుగురినీ తలో యింటికీ పంపేయగలిగాము. ఈ ఒక్కతి కూడా దాటిపోతే నా నెత్తిన - నీ వనేట్లు - కొంగే గిమిలికా, నిశ్చింతగా ఏ కాశీకో, గయకో పోయి—"

రమణయ్య ఆమెలో అధికమౌతున్న ఆవేదన గుర్తించాడు "ఆఁ! ఊరుకోవమ్మా, కబుర్లే గాని, అన్నీ అయ్యాక ఇక అల్లుళ్లూ - కూతుళ్లూ, మనమలూ - మనమరాళ్లూ, అవీ ఇవీ అంటూ తిరగకుంటావా? నా మాట అబద్ధమైతే ఈ ప్రక్క మీసం తెగ నరికేసుకోనూ?" అన్నాడు.

పున్నమ్మగారు పెరుగు వడ్డిస్తున్నదల్లా, చనువుకొద్దీ మొట్టికాయ మొట్టి, "నీవు మరీను!" అని నవ్వింది.

"లేక పోతే ఏమిటమ్మా! ఈ రోజుల్లోకూడా ఆడపిల్లంటే ఇంత భయమేమిటంటూ? ఇంతకీ ఆ చంద్రశేఖరం ఇంత చదువూ సంస్కారం వున్నవాడుగదా అతన్ని గురించీ బెంగేనా?—ఎందుకులే, నేను కలిసి తేల్చుకొస్తాను సరేనా?" అన్నాడు.

భోజనం ముగిశాక, అప్పుడు గుర్తొచ్చినట్లు రమణయ్య, "ఇదిగో సూర్యం, మరిచే పోయాను" అంటూ ప్రక్క జేబులోనుండి రెండు సంపెంగ పూలు తీసిచ్చాడు. "వీర్రాఘవులుగాడు ఆ మనోరంజితం సెంటు చాల మంచి సరుకు అన్నాడు ఇట్లా ఏడ్చిందేమిరా అనుకొంటూ వచ్చాను. ఈ సంపెంగను జేబులో వుండబట్టి అట్లా అన్పిస్తూ వచ్చిందన్న మాట! ఇప్పుడు చూడు మన సెంటు స్మెల్!" అన్నాడు సగర్వంగా.

సూర్యకాంతం విరగబడి నవ్వింది, "మరి' ఇప్పుడు మాత్రం ఆ సెంటు వాసనతో ఆ హేరాయిల్ వాసనా కలిసిరావడం లేదా - ఎట్లాగింక?" అన్నది. ఆ మాటకి రమణయ్యా నవ్వుకొన్నాడు. ఆ తరువాత పున్నమ్మగారి వద్ద శెలవు తీసికొని వెళ్లిపోయాడు.

ఇంకా చల్లగాలి తిరగలేదు...పంకా క్రింద సోఫాలో కూర్చుని పరమేశ్వరి శరత్ నవల 'పరిణీత' చదువుకొంటూ వుంది. ఆ హాల్లోనే వున్న పెద్ద వుయ్యాల బల్లమీద పడుకొని అమ్మాయి చందమామ తిరిగేస్తుంది. చెల్లెలి మీదికి వంగి తానూ ఆ పత్రిక లోని బొమ్మలు చూస్తూ, కొంచెం కొంచెంగా ఉయ్యాల నూపుతున్నాడో కాలితో అబ్బాయి.

అంతలో—వీధి గుమ్మం లోనుండి రెండు కంఠస్వరాలు చర్చించుకొంటూ లోనికి వస్తున్నట్లు వినికిడి అయ్యింది. మరు క్షణంలోనే అబ్బాయి తలెత్తి ఆలకించి, "అమ్మా, అమ్మా! నాన్నగారూ' రమణ బాబూ వస్తున్నట్లున్నారే! అన్నాడు. పరమేశ్వరీ పుస్తకం చదవడం ఆపి. ఆలకించి "ఒరే, మీరలా మేడమీదికి పోయి ఆడుకోండి" అని చెప్పింది. వెంటనే పిల్లలిద్దరూ పైకి వెళ్లి పోయారు.

వాళ్ళటు వెళ్లగానే, ఇటు రమణయ్యతో కలిసి వీరరాఘవులుగుప్తా ప్రవేశించాడు. రమణయ్య మళ్లీ యథాప్రకారం తయారయ్యాడు—ఆ మాసిన బట్టలు, రేగిన జుట్టు...గడ్డం కూడా మాసింది. చూచీ చూడ్డంతోనే, వాళ్లిద్దరూ ఏదో తీవ్రంగా వాదించుకొంటున్నట్లు కనిపెట్టేసింది పరమేశ్వరి. వాళ్లు హాల్లోకి రాగానే, లేచి పుస్తకం అలానే సోఫాలో పడేసి, మందహాసంతో ముందుకు రెండడుగులు వేసి, "ఓహో! చాల కాలానికి రమణబాబు ముఖంలో ఆందోళనా కళలు చూస్తున్నామే! ఏదో గొప్ప విశేషమే వుండి తీరాలి," అన్నది.

"ఆ ఆంధోళన తన్ను గురించిందైతే ఇక ఎవరికీ, ఆంధోళన వుండదు. కాని, వీడెప్పుడూ ఇతరుల గురించే గదా ఆందోళన పడ్తుండేది!" అంటూవెళ్లి సోఫాలో కూలబడ్డాడు గుప్తా.

"ఆట్లాగా—ఏం దయ ఏం జాలి?' అని రమణయ్య పోయి, ఉయ్యాలబల్ల మీద కూర్చుంటూ మళ్లీ ప్రారంభించ బోయాడు వాదం.

"ఉండు బాబూ, ఓ నిమిషం ఆగు- ఇప్పుడే వస్తాను. ఆ తరువాత చెప్పుదుగాని," అంటూ గబగబా లోనికి వెళ్లింది పరమేశ్వరి.

కొన్ని నిముషాల్లోనే ఆమె వెండి పళ్లెంలో లేత ముంజెలుంచుకొని మరీ తిరిగొచ్చింది. కాని, అప్పటికే వాళ్లిద్దరూ వాగ్వాదం ప్రారంభించేసి వున్నారు.

ఒక పళ్లెం భర్తకీ, మరోటి రమణయ్యకూ ఇస్తూ ఆమె, "ఈ కాస్తసేపు ఆగకుండా వాదించుకొనేటంత విశేష మేమిటబ్బా?" అన్నది.

గుప్తా భార్యవంకోసారి చూచి మిసుగునటిస్తూ," హుఁ! రెడ్డొచ్చె మొదలాట కాబోలింక!' అన్నాడు.

రమణయ్య నవ్వి, ఆంతేనా, మా చెల్లెలైతే మరీ తేలిగ్గా నీ వాదాన్ని ఏకీలు కాకీలూడగొట్టి ఊరుకొంటుందనా?" అనడిగాడు.

"వాదాన్నేమిచేసినా, సమాధి చేసినా, నాకే బాధా లేదు. నా కీళ్లూడగొట్టకుంటే చాలు, మీ చెల్లి!" అన్నాడు గుప్తా.

పరమేశ్వరి లజ్జతో' "ఛా, ఊరుకోండి" అని వెళ్లి భర్త ప్రక్కన కూర్చుంది.

గుప్తా, రమణ బాబులుముంజెలుఆరగించడంముగించాక; పరమేశ్వరి—"ఇప్పుడు ప్రారంభించండీ. కాస్త తాపం చల్లారి వుంటుంది!" అన్నది.

రమణయ్య నీరసంగా నవ్వి "ఒంట్లో తాపం చన్నీళ్లకైనా తగ్గి పోవచ్చుగాని: ఈ గుండెల్లో మంట అంత తేలిగ్గా చల్లార్తుందా? నేను నమ్మను!" అన్నాడు.

పరమేశ్వరీ నవ్వింది, "ఏం? కొంపదీసి ప్రకాశరావు పెళ్లి"

"అమంగళం ప్రతి హతమౌ గాక! నడమంత్రపుసిరిగాళ్లకీ, మిడిమిడి విజ్ఞానులకీ ఏ ఆదర్శం, సాహసం వుండక పోవచ్చుగాని, వాళ్లకేమమ్మా! తెలిసిన వాళ్లందర్నీ పిలిచారు. వచ్చిన వాళ్లే ఆప్తులనుకొన్నారు. అనుకొన్న ప్రకారమే అన్నీ జరుపుకొన్నారు; ఇక నిశ్చింతగా, జంటగా హాయిగా సుఖించనున్నారు—వాళ్ల కేమింక!" అన్నాడు, రమణయ్య.

(సశేషం)



# సంధి

రచన.:
శ్రీ కె. పి. బాబు

(గత సంచిక తరువాయి)

పరమేశ్వరి వింతగా భర్తకేసి 'మరింకెవరిగురించి?' అన్నట్లు చూచింది.

గుప్తా ఓసారి నిట్టూర్చి'' అదిగో, మన పున్నమ్మగారు లేదూ? వాళ్ళ సూర్యకాంతం పెళ్ళి విషయం—' అని ప్రారంభించాడు.

'అవును. ఆ పిల్లకి మేనరిక మేదో వుందనుకొంటారే, ఇంకేం బాధ?' అన్నది పరమేశ్వరి.

'అదే బాధగా తయారయ్యింది! చంద్రశేఖరమని. ఆ కుర్రాడిప్పుడు నెల్లూరులో వుంటున్నాడు. మా అందరకూ ఫ్రెండు కూడాను! నేనలా ప్రకాశరావు పెళ్ళికెళ్తుంటే ఈ పున్నమ్మగారేమో వాళ్ళమ్మాయి సంగతి కాస్త తేల్చుకు రమ్మంది వాళ్ళని—' అన్నాడు రమణబాబు.

'ఏదేమో పేల్చుకొచ్చాడు!' అని అందుకొని గుప్తా, 'చూచిరమ్మంటే కాల్చివచ్చే బాపతు వాళ్ళిటువంటి విషయాల్లో పనిచేయకూడదురా బాబూ అంటా నిందుకే, తెలిసిందా?' అన్నాడు.

కొంచెం కోపం కలిగి రమణయ్య ఏదో జవాబివ్వబోయాడు కాని, పరమేశ్వరి చిరాకుతో - 'ఇదే మీ దగ్గరున్న పాడుబుద్ధి! సంగతేమిటో కాస్త చెప్పకుండానే ఊరికే వాదాలు ప్రారంభిస్తారు - ఏం మగాళ్ళో నబ్బా!' అన్నది. భయం నటిస్తూ గుప్తా కొంచెం ఆమెకు దూరంగా తొలిగి కూర్చుని, 'నిజమే సుమా! మగాళ్ళకే మొచ్చినా ఫర్వాలేదుగాని. ఆడాళ్ళకి కోపంవస్తే— అందులో శ్రీ కన్యకాపరమేశ్వరీ అపరావతారమైన నీకు వస్తే - భస్మమై పోయామన్నమాటే! ... చెప్పరా బాబూ!' అన్నాడు.

రమణయ్య గంభీరంగా ఆలోచిస్తూ 'నీవే చెప్పు, నాకేం బాగోలేటీపూట' అన్నాడు.

'అయితే విను, నేనే చెప్తాను -' అని ప్రారంభించాడు గుప్తా. 'అగర్భ శ్రీమంతులైన, పున్నమ్మగారు అయిదుగురాడపిల్లలకి పెళ్లిళ్లుచేసేసరికే అధః పతనమై పోయిందిగదా! ఈ ఆఖరమ్మాయి నెలా వదిలించుకోవాలన్న సమస్య ఆమె కెప్పుడూ లేదు - ఎందుకో తెలుసా?' అని, భార్యకేసి చూచాడో క్షణం.

'అవును. ఈ చంద్రశేఖరంకోసమే ఆ పిల్ల పుట్టిందని అంతా అనుకొనేవారట!' అన్నది పరమేశ్వరి.

అది విన్న రమణయ్య అందుకొని, 'అంతా అంటె మరెవరో కాదు ఆ చంద్రశేఖరంగాడి అమ్మా వాళ్ళే ఆ పిల్ల పుట్టినప్పటినుంచీ అలా అనడం ప్రారంభించారట! ఆపిల్ల పుట్టినప్పటికి ఇంకా పున్నమ్మగారింట్లో నగలూ నాణేలూ మూల్గుతూనే వున్నాయి. ఇప్పటికీ చంద్రశేఖరంగాడి నాన్నగారిస్థితి ఇప్పటి దాన్లో వందో వంతుకూడా లేదట. అందుకనే అప్పట్లో తమ మేనరికాన్ని అంత బలపర్చుకొన్నారు. వాళ్ళని యీ వేళ తెలుస్తోంది!' అన్నాడు.

'అదా సంగతి? ఊఁ! ఇప్పుడేమైందింతకీ?' అన్నది పరమేశ్వరి.

'చెప్తున్నానుగా, తొందరపడకూ' అని ప్రారంభించాడు మళ్లీ గుప్తా. 'అలా అనుకొన్న తరువాత వాళ్ల స్థితి పెరగడం, వీళ్ళది దిగజారడం మెల్లగా జరుగుతూ వచ్చింది. పిల్ల యుక్తవయస్సు కొచ్చాక ఇక ఆ పిల్ల వూసే ఎత్తడం మానేశారట వాళ్ళు. అదిచూచి పున్నమ్మగారు గోలచేస్తే - కుర్రాడు స్కూల్ ఫైనల్ పాసయ్యాక చూద్దాం అన్నారట. సరేనని అప్పటికి వూరుకొందామె. వాడేమో మొదటి సంవత్సరమే పరీక్ష ఫాసైపోయ్యాడు, ఖర్మకాలి. మళ్లీ పున్నమ్మగారడిగింది. కాలేజీలో చేరాడబ్బాయి. అది పూర్తికావాలి అన్నారట వాళ్ళు. సరేలే అని వూరుకొందామె. ఇప్పుడా చదువూ పూర్తయ్యింది... కాని, వాళ్ళేమీ ఈ పిల్ల గురించి ఆలోచించడమే లేదని తెలిసి పున్నమ్మగారు పడి, కబుర్లమీద కబుర్లు పంపుతూవుంది. ఇప్పుడు మన వాడితోకూడా ఒక కబురంపింది — తెలిసిందా? అని ఆగాడు.

'పంపితే, ఏం జరిగిందండీ?'

'గుప్తా నవ్వాడు. 'ఏముంటుందిలే! ఈ రోజులే ఇటువంటివి ఇంతకీ,' అన్నాడు, రమణయ్యని చూస్తూ.

'ఆ మాటే అనకు, నాకమంట! చేతగాని వెధవలం అని ఒప్పుకోక, 'రోజులూ, పరిస్థితులూ' అని సమర్థించుకొంటారెందుకంట?' అని లేచాడు రమణయ్య.

పరమేశ్వరి లేస్తూ, 'ఇదిగో మళ్ళీ మొదటికొచ్చారు. పోనీ, మీ నోటి తీటే తీర్చుకోండి బాబూ, నేను పోతా నింక' అన్నది.

'గుప్తా సరసంగా ఆమె చేయిపట్టుకొని కూర్చోపెట్టి, 'చెప్పేస్తున్నా, ఈ కాస్తాదివినిపో! మళ్ళీ రాత్రంతా ఎవడు జాగారం చేస్తాడు నీతో? కూర్చో!' అన్నాడు.

'ప్రకాశరావు పెళ్లిపని చూచుకొని వీడు తిన్నగా వెళ్లి ఆ చంద్రశేఖరం ఇంట్లోనే మకాం పెట్టాడంట. పెద్ద వ్యవహర్తలా ఆకబురూ యీకబురూ చెప్పి కాలక్షేపంచేసి చూచాడట వాతావరణాన్ని. ఏ మూలా ఆశాజనకంగా కన్పించలేదు. అందుకని ఇక ఆ చంద్రం మీదనే ఆశపెట్టుకొని మెల్లగా-ఓ ఒంటరివేళ చూచి మరీ కదిపాడట. వాడేమో తడబడి, కాస్సేపు 'మా అమ్మావాళ్లిష్ట'మనీ-కాస్సేపు 'ఉద్యోగం దొరకంది చేసుకోలే'నని చెప్పాడట. మనవాడు సామాన్యుడా? 'నీకేమో నూట ఏభై రూపాయల గవర్నమెంటు నౌఖరీయే నెల్లాళ్లలో ఖచ్చితంగా వస్తుందని తెలిసిందిదే! అదీగాక, ఇంత చదువుకొన్నావు-అన్నికబుర్లు చెప్పేవాడివి. ఇప్పుడేమో అమ్మా నాన్నలంటావేమిటి?' అని తగులుకొన్నాడట. 'ఏం-సూర్యకాంతం అంత చదువులేనిదా? అంద వికారా? చెడ్డదా? పోనీ, నీకిష్టంలేదా?' అంటే దేనికీ 'అవును' అనలేకపోయాడంట అతను. 'మరేమిటి అలక్ష్యం?' అంటే, ఫలానా అని ఏమీ చెప్పకుండానే జారుకొన్నాడట. ఆమీద మనవాడు తీవ్ర పరిశోధనచేసి తెల్సుకొన్న విషయాలేమిటంటే—'

'నేనూహించేశాన్లెండి,' అని అడ్డుతగిలింది పరమేశ్వరి.

గుప్తాతోబాటు, రమణయ్య సైతం వింతగా ఆమె వంకకి చూచాడు.

'ఏముంటుందింక? ఆరోజుల్లో ఏదో అందరట్లలాగా తాముకూడా కొంత పున్నమ్మగారి సంపద పంచుకోగలమని అలా అంటూవచ్చారు. కాని, ఇప్పుడా సంపద కాస్తా హారతి కర్పూరంలా హరించుకుపోయేసరికి వట్టి పిల్లని పుచ్చుకోవడం కష్టంగావుంది వాళ్లకి. అది ఒక్కసారిగా చెప్పేస్తే వాళ్ల సభ్యతకీ, సంస్కారానికీ విరుద్ధమే-పదిమందిలో ఆభాసుపాల్గావల్సి వస్తుందన్న భయంతో ఇలా తటపటాయిస్తున్నారనుకుంటూ-అంతేనా రమణ బాబూ?' అన్నదామె.

రమణయ్య విస్మయంగా, 'సరిగ్గా ఈమె ఊహించిందే రైటు! చూచావా, ఆడాళ్ల తెలివితేటలు!' అన్నాడు గుప్తాతో.

'అది సరేగాని, పాపం-ఇంతకీ ఏమి నిర్ణయమైంది చివరికి?' అని అడిగింది.

'అలా తెలిసి వీడి మా నాన్న వీడూరుకుండిపోతే పోయేది—మరో కొంతకాలం పున్నమ్మగారికి బెంగ లేకుండా పోయేది! కాని, వీడిప్పుడే అది తేల్చిపారేసి, అటు వాళ్లకి తేలికా-ఇటు పున్నమ్మగారికి బరువూ కల్గించుకొచ్చాడు!' అన్నాడు గుప్తా.

'మీరు భలేవారే. అటువంటి గుండెలపై కుంపట్లని ఇంకా అలానే వుంచుకోమంటారా?'

'అదికాదు, ఇటువంటిపనులు అనవసరంగా మనచేతులారా చేయడం ఎందుకంటా! చివరికోనాడు వాళ్లలో వాళ్లే తేల్చుకొంటేపోయే! ఇప్పుడుచూడు, యిక జీవితం ఈ ప్రస్తావన వచ్చినప్పుడల్లా వాళ్లందరూ మనవాడిని తల్చుకోకుండావుండరుగదా! అదీ నాబాధ,' అన్నాడు గుప్తా.

రమణయ్యమాత్రం చింతించలేదు. ఆవేశంతో, 'ఏమైనా కానివ్వు నాకు, ఏం భయంలేదు. కాని, పున్నమ్మగారవంటి అమాయకురాలిమీద-సూర్యకాంతంవంటి అబలమీద జరిగే కుట్రనీ, అన్యాయాన్నీ హృదయమున్నవాడెవడూ సహించకూడదు! ఎవడికుంగతో నాకెందుకు? నేనేమాత్రం సహించను!' అన్నాడు.

పుస్తకాల్లో 'డైలాగు అప్పగించడం కాదురా-ఇట్లాంటి విషయాల్లో నీకనుభవం తక్కువ అనాడు చంద్రశేఖరం చదువుకే తగిన స్థితిలో లేకున్నారు కనుక,

వాళ్లు ఆ సమయంలో పున్నమ్మగారి దగ్గరున్న ఆస్తిపాస్తులు చూచి అబ్బాయి భవిష్యత్తు బంగారం కాగలదని ఆశతో అలా అనుకొంటూ వచ్చారు. ఇప్పుడేమో అబ్బాయి ప్రయోజకుడయ్యాడు. పెద్ద పెద్ద సంబధాలే కళ్లుమూసుకు రాగలవు; పున్నమ్మగారేమో సామాన్యురాలై పోయింది. కనుక, ఎప్పుడో ఏదో అనుకొన్నాం గదా అని ఇప్పుడటువంటి గొప్ప సంబంధాలని ఈ సంబంధంకోసం కాలదన్నుకొంటారా?...అందుకే' నేననేది, మనుషులు పరిస్థితులకి దాసులేనని! అన్నాడు గుప్తా.

కోపంతో చట్టున లేచాడు రమణయ్య 'సిగ్గులేకపోతే సరి! మనిషై పుట్టాక ఆమాత్రం నీతిలేకపోతే ఎందుకంట, బ్రతికి? ఈ 'మనుష్యులూ-పరిస్థితులూ' అంటూనే సమర్థించబోయింది వాడి చెల్లెలు. అంతా సావధానంగా విని నేను 'బాగనే వుందమ్మా, మరి రేపో మాపో నీవూ పెళ్లి కావలసిందానివేగదా-నిన్న పెళ్లాడాలని వచ్చినవారు సరిగ్గా ఆ పెళ్లి వేళకి ఇంకా మంచి సంబంధం వచ్చి-నిన్నొదిలివేసి ఈ వాదంతోనే తమని తాము సమర్థించుకుపోతే నీవేం చెప్తావో, కాస్త శెలవిస్తే చాల సంతోషిస్తాను' అనడిగాను. అదివిని ఏమందో తెలుసా? అన్నాడు.

'చక్కగా అడిగావుగాని, ఏమన్నదా అమ్మాయి బాబూ?' అన్నది పరమేశ్వరి.

'ఏమంటుంది? 'నీకు కల్చర్ లేదు?; కాబట్టే ఒక ఆడదానిముందు ఇలా మాట్లాడుతున్నావు, పొమ్మంది'! ఏమనుకోవాలమ్మా వీళ్ల కల్చరేనని?!' అన్నాడు భారంగా రమణయ్య.

గుప్తా అదివిని ఇంకేమీ మాట్లాడలేదు. తరువాత కాసేపు పరమేశ్వరీ, రమణయ్యలు మాత్రమే పున్నమగారి విషయమై మాట్లాడుకున్నారు.

♦ ♦ ♦

నాటిరాత్రి...ఇల్లంతా సర్దుకొని పరమేశ్వరి మేడమీది పడకగది చేరేసరికి, పిల్లలిద్దరూ హాయిగా నిద్రపోతూవున్నారు. భర్త మాత్రం మంచంమీద పడుకొని కిటికీలోనుండి పడుతున్న వెన్నెలన్ని చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

మెల్లగ అతని పక్కలో కూర్చుంది పరమేశ్వరి. అప్పటికిగాని ఆమెరాక గుర్తించలేదు గుప్తా.

'ఏమిటో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నారే?' అని అడిగిందామె.

'మరేమీ లేదు, 'రోజులు పరిస్థితులు' వాటి గురించే ఆలోచనలూరికే వస్తున్నాయి.'

-'అంటే గుర్తొస్తుంది మళ్లీను. పాపం, ఆ పున్నమ్మగారెంత బాధపడుతున్న దానిముందు?!' అన్నాడు.

'అవును. మొత్తానికి మీ స్నేహితుడు చాల విచిత్రంగా కన్పిస్తాడే!'

'చిన్నప్పటినుంచీ వాడంతే, తెలుసా? తల్లీ తండ్రీ, అన్నాదమ్ములు, అక్కచెల్లెళ్లు అంతా వున్నారు. అంతవున్నవాళ్లూ కారు; బాగా సంపాదించుకొనే బాపతూ కాదు! అందరిలోకి ఈ రవణ మరీ అన్యాయం. సగం సగం చదివి, దేశంమీది కెగబడ్డాడు. ఈ ప్రాంతాల్లో వాడి సంబంధంలేని రాజకీయ పార్టీలుగాని, సాహిత్య

(తరువాయి 18వ పేజీలో)



ప్రభుత్వం తాను తలపెట్టిన బృహత్తర ప్రణాళికల నిర్వహణావశ్యకత దృష్ట్యా ఈ సహాయం ప్రణీతం కొంత తక్కువగానే వున్నట్లు కనిపించినప్పటికీ, ఉత్తమ చిత్రాలకు, దర్శకులకు, నిర్మాతలకు, డాక్యుమెంటరీలకు-నగదు-సర్టిఫికెట్లు రూపంలో యిస్తున్న 'రికగ్నిషన్' మూలంగా మన చిత్రాల నిర్మాణం-ముఖ్యంగా దక్షిణాదిని-అందులోను తమిళ, తెలుగు, కన్నడ భాషా చిత్రాల ప్రతిపత్తి హెచ్చిందని నిశ్చయంగా చెప్పవచ్చు ''పెళ్ళినాటి ప్రమాణాలు,'' ''మాంగల్యబలం,'' 'బడిపంతులు వంటి' చిత్రాలు అత్యుత్తమ కళాఖండాలై ప్రజలనాకర్షించినవి. ప్రభుత్వ బహూకృతుల నందుకున్నది.

కాగా మన నిర్మాతలు-తక్కువ పెట్టుబడులు-కొత్త నటీనటులు-చక్కని చిన్నవైన ప్రయోజనాత్మకమైన చిత్రాలు నిర్మించి దేశాభ్యుదయ సాధనకు తోడ్పడడం అవసరం. విదేశాలలో నేటివరకు కొనసాగుతున్న చిత్ర నిర్మాణపు తీరుతెన్నులను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించడం అత్యంతాభిలషణీయం కాదంటారా?

---

(16వ పేజీ తరువాయి)

కళాసంస్థలుగాని, నాటకసమాజాలుగాని ఏవీ లేవే అనుకో! వాడి పరిచయాలు మరీ తమాషాగా వుంటాయి సుమా. ఆడవాళ్లుగాని, మగాళ్లుగాని-ఏ వయస్సుగాని, ఏ అంతస్తుగాని-తనకు అవతలివారి ప్రవర్తన వచ్చితే చాలు. ఇట్టే ఏదో కల్పించుకొని, ఏ వరుసో కలిపేసి పెనేసుకు పోతాడు. నా దగ్గరకి వచ్చేదాకా వాడి ముక్కూ ముఖం ఎరుగవు-నీతో ఎట్లా కత్తు కలిపే వాడో చూశావుగదా? అన్నిచోట్లా ఇంతే! వాడి మనస్సు నిర్మలమైంది కాబట్టి ఎక్కడా ఏ సందర్భంలో కూడా ఇంతకాలం చెడ్డపేరు తెచ్చుకోలేదనుకో!'

'నిర్మలమే ఏమిటండీ, ఉన్నతమైంది కూడాను! తనకి కడుపు నిండిందో లేదో, తన ఇంట్లో అయినా ఇన్నిగింజలున్నాయో లేవో ఆలోచించినట్లే కన్పించదు. ఎప్పుడూ ఎవరెవరి బాధలగురించో యోచిస్తూ కూర్చుంటాడు. ఎవరెవరి ఆనందాలో చెప్పిచెప్పి సంతోషిస్తుంటాడు. అటువంటివాడికే పాపం, దేశద్రిమ్మరి బ్రతుకు!'

'ఏంచేస్తాం? కాలం-' అని నాలిక్కరుచుకొన్నాడు గుప్తా. ఆ మాటలు భార్యకి నచ్చదని తెలిపోయింది. అందుకని ప్రస్తావన మార్చివేసి-'మధ్యాహ్నం అమంటూ ఈ మంటూ నామీదా చూపెట్టాడుసుమా!' అన్నాడు నవ్వి.

పరమేశ్వరి వింటూ పడుకొంది.

దేశంలో మరీ ఇంత అవ్యవస్థ ప్రబలిపోవడానికి కారకుల్లో నీబోటివాళ్లూ చేర్తారా అంటూ నామీద లేచాడు. మా నాన్నగారు పోయాకనైనా నేను బాగు పడ్తానని ఆశించుకూ వచ్చాడట. కాని, ఆయనపోయినా నేనింతైనా మారలేదట! వేనకువేలు సొమ్ము మూల్గుతూ వున్నా, ఇతరులకేమీ పనికిరాకుండా, నామట్టుకు నేను హాయిగా జీవిస్తూ వున్నానట. చివరికి పెళ్లి విషయంలో కూడా కట్నాలకి ఆశించి బాగా వున్నవాళ్లమ్మాయినే - అంటే నిన్నే - పెళ్లాడేశానంట! ఈ విధంగా సిరిసంపదలు పెంచుకొంటూ కుదురుగా కూర్చుని కాలక్షేపం చేయడంకంటే మరెందుకూ పనికిరాకుండాపోయి, అవిధంగా ఇంకా కొందరభాగ్యులని-శక్తి వుండీ కనీసంగానన్నా సహకరించకుండా - జీవచ్ఛవాల్ని చేస్తున్నానంట! అందులో వాడొకడన్నట్లు చెప్పాడు, అది మరీ తమాషా సుమా!' అని నవ్వాడు గుప్తా.

'ఏమిటీ?' అన్నదాసక్తిగా పరమేశ్వరి.

'వాడేవిధంగా రాణిస్తాడో మనకి బాగా తెల్సునట. వాడిలాంటివాళ్లకి సహకరించడం మనకి అధికలాభాలట కూడా! అయినా, మనమిసుమంతకూడా తెగించ సాహసించకుండా, పూర్తి సహాయ నిరాకరణమన్నా చేయక, ప్రాణాలు పోకుండా గొంతు తడుపుతున్నట్లు అడపాదడపా స్నేహధర్మంపేరమాత్రం సాయపడ్తూరన్నామట. అది చిత్రహింసతో మాత్రమే సమానం అని వాదించి వాదించి ఎంతైనా బాధపడ్డాడనుకో-'

'నన్నడిగితే రవణబాబు వాదమంతా కరెక్టే అంటాను!' అన్నది హఠాత్తుగా పరమేశ్వరి.

గుప్తా తెల్లపోలేదు. ఆమె వేళాకోళ మాడ్తున్నదనుకొని మందహాసం చేశాడు.

(సశేషం)

# సంధి

రచన:
శ్రీ. కె. పి. బాబు

(గత సంచిక తరువాయి)

ఈ మాత్రం లోకజ్ఞానం ఆరోజుల్లోనే నాకు వుండి వుంటే - మా తల్లిదండ్రులు కాదు, హరిబ్రహ్మాదులొచ్చినా సరే ఇటువంటి పెళ్లికి ఒప్పుకోనే దాన్నే కాను! రమణ బాబన్నట్లు శక్తిసామర్థ్యాలన్నీ వుండి, వాటికి తగిన అండదండలు లేక అభాగ్య జీవితం వెళ్లబుచ్చే ఎవరో ఒకరికి చేయిచ్చివుండేదాన్ని... అది కొన్ని కష్టనష్టాలు కల్గించేపనైనా ఇంత మానసిక తృప్తి, శాంతి వుండేది, హాయిగా!' అన్నది, ఆమె ధోరణికి చకితుడయ్యాడు గుప్తా. అయినా, తేరుకొని చమత్కారంగా 'ఇప్పుడుమాత్రమేం మించిపోయిందీ? పిల్లల్ని నా కొదిలేసే పక్షంలో విడాకులిస్తే ఇచ్చేస్తా! సరే నా?' అన్నాడు,

'అమంగళం ప్రతిహతమాగాక!' అని భర్త నోరు మూస్తూ, ఆమె నవ్వింది.

'అదికాదండీ, వడ్డీలు తింటూ బ్రతకడం మీ తాత ముత్తాతలకీ, మా పెద్దాళ్ళకీ సరిపోతే సరిపోవచ్చుగాని, మీరనేటట్లే పోనీ, కాలం పరిస్థితులని ఆలోచించినా, ఈ కాలానికి ఈ పరిస్థితులకీ అది నెత్తుటికూటితో సమానమేగదా మనకి ఏం బ్రతుకండీ! ఇది? చక్కగా చదువుకొన్నారు, తెలివితేటలున్నాయి. మేధావులైన అనేకమంది ప్రాణమిత్రులున్నారు'...

ఆమె మాటలు వింటూ గాఢంగా నిట్టూర్చాడు. 'నీకు నాలోని దౌర్బల్యం తెలియదు పరం! మా అమ్మానాన్నా పెంపకమే ఈ విధంగా తయారుచేసింది. ఈ పరిస్థితుల్నీ, మిత్రుల్నీ చూస్తుంటే ఏవేవో చేయాలనీ, చేయించాలనే వుంటుంది. కాని... కాని—'

ఏమిటా కానీ? చెప్పండీ, అర్థణా చేద్దా!' అన్నదామె ఉత్సాహంగా.

'పెళ్ళి విషయంలో మీ నాన్నని ఎదిరించి వుంటే ఏమైయ్యేదిరా, అనడిగాడు నన్ను రమణ. ఈ ఆస్తిఅంతా ఏ అనాథ శరణాలయానికో పోయుండేదిరా అన్నాను. ఇట్లా నీ దగ్గర పడివుండేకన్నా, ఇది అట్లా పోయున్నా సద్వినియోగమై వుండేదికదరా, అన్నాడు! అతనే ఉద్దేశ్యంతో అన్నా, ఆ మాటల్లో చాల నిజమున్నట్లే తోస్తోంది. ఆదినుంచి కష్టపడి సంపాదించిందైతే పోతుందనే భయమే వుండదు. ఎందుకంటే, ఒకవేళ పోయినా కష్టపడి సంపాదించుకోవడం అలవాటైవుంది కనుక. కాని, ఇలా గారాబంగా రాజకుమారుడిలా పెంచబడి, అప్పనంగా చేతికందిన సొమ్ముని ఏం చేయాలన్నా బెంగగా వుంటోంది. ఏం చేస్తే ఏమౌతుందో? ఏది జరిగితే ఏమైపోతామో? అని భయం భయంగా వుంటూంది...'

భర్త ధోరణికి పరమేశ్వరి విసుగెత్తి పోయినట్లుగా కన్పించింది. 'బయల్దేరారుగాని, మగాళ్లు! కాస్త ఆ కిటికీలు చేరవేసి ఇక నిద్రపోండీ - నాకేమో నిద్రొస్తోంది! ఇక చాలు—' అని ఇటు తిరిగి పండుకొంది...

ఆ రాత్రి గుప్తాకి నిద్రపట్టనేలేదు...రమణయ్య; చంద్రశేఖరం, అతని చెల్లి; ప్రకాశరావు, అతనిభార్య; పున్నమ్మగారు, సూర్యకాంతం - చివరికి తనభార్య పరమేశ్వరి సైతం ఒకరి తరువాత ఒకరుగా తమతమ మనసులు విప్పి చెప్పుకుంటున్నట్లే భ్రమిస్తూ ఆలోచిస్తూ గడిపేశాడు.

♦ ♦ ♦

మరునాటి ఉదయం కాఫీత్రాగి అలా బజార్లో వెళ్ళాడు గుప్తా. అతని మనస్సుకొంచెం తేలికగా వున్నట్లుందప్పుడు...

అలాఅలాపోయి సరస్వతీ ప్రెస్సు చేరాడు. ఊళ్లో వున్న ప్రెస్సులన్నింటిలోకి అదే పెద్దదీ, మంచిదీను దాని యజమాని ఆమధ్యే చనిపోయాడు. ఉన్న ఒక కొడుకూ వట్టి దౌర్భాగ్య దామోదరుడు కావడంతో దాన్ని నిర్వహించుకోవడం కష్టమై అమ్మేస్తున్నట్లు తెలిసింది...

గుప్తా లోనికి పోగానే ఆ 'దామోదరుడే' ఎదురొచ్చి కుర్చీచూపాడు. అప్పుడే ప్రెస్సంతా సర్దేస్తున్నారు...

'ఏం? అమ్మేసినట్లేనా?' అన్నాడు గుప్తా.

'లేదుసార్. ఇప్పటికి నిల్చివున్నాయి రెండు బేరాలు...మరొకమాట చూచి ఎవరో ఒకరికి సెటిల్ చేసెయ్యాలని...'

'ఎంతలో వున్నాయి ఆ బేరాలు? నీకు కావలసిందెంత?' అనడిగాడు గుప్తా. వివరంగా చెప్పాడా దామోదరుడు,

'సరే, ఆదివారం రేపేకదూ? రేపు ఒకసారి నన్ను కల్సుకో, అందాకా ఎవరికీ మాట ఇవ్వకు. సోమవారం నాటికి ఫైసలా అయ్యేపద్ధతిచూస్తాను ఏం?' అన్నాడు.

గుప్తా అంటే ప్రాణం దామోదరానికి. 'అంతకన్నానా, సార్!'' అని నమస్కారంచేసి, సాగనంపాడు...

అక్కడనుండి గుప్తా తిన్నగా పున్నమ్మగారింటికి వెళ్లాడు. వాళ్లింటికి అతను తరుచుగా వెళ్లడు. అందుచేతనే అతని రాకని చూచిన సూర్యకాంతం గబగబా ఇంట్లోకిపోయి వాళ్లమ్మకి చెప్పింది. పున్నమ్మగారు కొంగు సవరించుకొంటూ వచ్చి, అప్పటికే ఇంట్లో ప్రవేశించిన గుప్తాని ఆహ్వానించి మర్యాదచేసింది.

కొంతసేపు ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు. జరిగిన సంగతి తలపుకొచ్చి ఆమె కృంగిపోతూవుంది. ఆమె ఖిన్నవదనం చూచి గుప్తా ఏమీ పాలుపోక కూర్చుండిపోయాడు...

చివరికి ఆమే నోరువిప్పి మందస్వరాన—'చూచావా నాయనా?' అంది.

'అంతా విన్నానమ్మా, నీవు మళ్లీ మళ్లీ తల్చుకొని ఊరికే బాధపడకు', అన్నాడు గుప్తా.

'అదికాదు నాయనా, ఆయన పోయాక ఇంతబాధపడ్డం ఇదే ననుకో!' అంటూ ఆమె ఆగకుండా దుఃఖించసాగింది.

'ఏమిటమ్మా, నీ చాదస్తంగాని. ఇంతలో ఏంపుట్టి మునిగిపోయిందంటా! అమ్మాయి ఏమన్నా వయసు ముదిరిపోయిందా-ఇంక పెళ్లే కాదా? అసలిదేమీ జరుగనట్లే అనుకొని, అమ్మాయిని పూర్తిగా చదివించెయ్యమ్మా. ఆచదువును పూర్తిచేసిందంటే, ఇక ఆమె పెళ్లి నువ్వే చెయ్యాలన్న బాధలేకుండా పోతుంది హాయిగా!' అన్నాడు.

అతనొకసారి చూచింది పున్నమ్మగారు 'మీరెంత అమాయకులు నాయనా' అన్నట్లు! అదిచూచి 'ఏమమ్మా, అలా చూస్తావు?' అని అడిగాడు.

'నాయనా, ఆడపిల్లనుకన్నబాధ ఇంకా మీ కర్థం కాలేదు కనుక ఇంత తేలిగ్గా తలో సలహా ఇచ్చేస్తున్నారు. చేసిచూస్తే తెలుస్తుంది. ఇప్పుడీవిధంగా పెంచడానికే నేనెంత తికమకలాడిపోతున్నానో-ఒంటరి ఆడదాన్ని ఇంక దానికి చదువుకేమిపెట్టి చెప్పించను? కాకుల్లా పొడిచే లోకులతో ఎట్లా వేగను?...అయ్యో!' అంది.

...'లోకులు తమని సమాధి చేస్తారని భయపడే వాళ్లు, తమకి గోతులు తామే త్రవ్వుకొని ఆ లోకులపని సులభంచేస్తారు! అట్టి దుర్బలులే మనలో ఎక్కువ-కనుకే మన సమాజాభ్యుదయానికి యింత కష్టనష్టాలనుభవించాల్సి వస్తోంది!' అని ఒకసారి రమణయ్య తనతో అన్నమాటలు చప్పున స్ఫురించి, గుప్తా 'బాబు బహుశా ఈమెవంటివాళ్లని చూచే అలా అనివుంటాడు. అప్పుడేమో వీడి ఛోరణే ఇంత అనుకొన్నానేగాని ఇప్పుడా మాటలు యదార్థమే నన్పిస్తున్నయ్యే!' అనుకొన్నాడు.

'పోనీలే అమ్మా, నీక్కావలసింది అమ్మాయి పెళ్లే అయితే, దానికిమాత్రం దిగులెందుకు? నిశ్చింతగావుండు, మేమంతా లేమా? ఆసంగతే చెప్పిపోదామని ఇలా గొచ్చాను', అన్నాడు.

'ఇప్పుడు నాకు మిగిలింది చింత ఒక్కటేగదా. ఇక నిశ్చింత ఎక్కడ్నుంచొస్తుంది? ఇంత జరిగాక ఎవరొస్తారు నాయనా, ఈ పిల్లకోసం? నేనింకేం చేసేది నాయనా?' అని కళ్లనీళ్లు పెట్టుకొన్నదామె.

గుప్తా ఆశ్చర్యం [illegible]స్తూ, 'అదేమిటమ్మా నీవు మరీ విపరీతంగా మాట్లాడుతావే! దేశమంతా ఆచంద్రశేఖరం లాంటి అవకాశవాదులే నంటావా? ఆదర్శప్రాయులెవరూ లేనేలేరంటావా?' అన్నాడు.

'ఏదీ, ఇంతమంది మీరంతా 'మేమున్నాం నీకేం భయం?' అంటున్నారుగా-వెతికి ఒకడ్ని తెచ్చిపెట్టండి, చూస్తాను?' అన్నదామె అంత దుఃఖంలోనూ.

గుప్తా, ఉన్న ధైర్యసాహసాలన్నింటినీ కూడదీసుకొని, నిబ్బరంగా-'అంతకష్టమేం లేదమ్మా నేనైతే

వెంటనే ఏ మన రమణబాబునో ఎన్నుకొంటాను!' అనే వాడు.

తలుపుచాటునుండి అంతా వింటున్న సూర్యకాంతం తన చెవుల్ని తాను నమ్మలేకపోయింది!...

పున్నమ్మగారా మాటవిన్న కొంతసేపటివరకూ చిత్తరపోతూవుండిపోయి, తరువాత-'నాయనా', వళ్లి వళ్లి చస్తున్న మాతో వేళాకోళాలాడ్డానికా ఇలా వచ్చావ్?' అన్నది దీనంగాను.

'మా అమ్మతరువాత అంతటిదానివి నీతోనా నేనలా ప్రవర్తించడానికి సాహసించేది? ఆ లేదానివమ్మా మొత్తానికి! నన్నడిగావు; నాకు తోచింది చెప్పాను. ఏం? రమణబాబు ఆ చంద్రశేఖరంకన్న పనికిమాలినవాడా?' అన్నాడు తొణక్కుండానే.

పరిచయమైనప్పటినుండీ, మగబిడ్డలేనిలోటు తెలియనివ్వకుండా దినదినం తమలో నూతనోత్సాహం కల్గిస్తూ తిరుగుతూవుండే ఆ రమణబాబుకీ; స్వార్థపరుడైన ఆ చంద్రశేఖరానికీ పోలికపెట్టడంతోనే పున్నమ్మగారి సున్నిత హృదయం చాల బాధపడింది. 'అలా అనకు నాయనా' అన్నది వెంటనే.

'మరేమనుకోనేది? మన రమణబాబు తెలివితేటల ముందు, గుణగణాలముందు మనకు తెలిసినంతలో ఎందు నిలబడగలడూ అనడుగుతున్నాను. మనకి కావలసింది అమ్మాయి యావజ్జీవితపు సుఖసౌఖ్యాలు గాని, ఆ మూడు ముళ్లు పడేవరకూ కన్పించే అడంబరాలు కావుగదా?! నీకేమిటమ్మా ఇంకా సందేహం? చెప్పు త్వరగా-పెళ్లికి వాడిని ఒప్పించడం, పెళ్లిచేయడం అవన్నీ మేము చూచుకొంటాముగా!' అన్నాడు.

పున్నమ్మగారికేమీ పాలు పోలేదు.....లోన సూర్యకాంతానికి - ఒకటే తహతహగా వుంది, అమ్మేమంటుందోనని!

చివరికి తడబడ్తూ పున్నమ్మగారు, 'ఇంకోలా అనుకోకు బాబూ-ఎంతైనా, ఇంత ఇదిగా' పెంచుకొచ్చిన ఆఖరి పిల్లని చూస్తూ చూస్తూ-అని ఇంకేమీ అనలేక ఆగిపోయింది.

ఫకాలున నవ్వేశాడు గుప్తా. 'పిచ్చితల్లీ, నా కర్థమైందిలే నీ బాధ! దేశద్రిమ్మరిగాడని, తాడూ బొంగరం లేనివాడననేగా నీ భయం? నిజమే-అటువంటివాడెంత బుద్ధిమంతుడైనా-ఏమైనా సూర్యకాంతంలాంటి సుకుమారినిచ్చి పెళ్లిచేయడం మాకుమాత్రం ఇష్టముంటుందా అమ్మా?' అని అడిగాడు.

'గుప్తాగారికి మతిపోయిందా? ఏమిటిట్లా క్షణానికోతీరుగా మాట్లాడుతారు?' అనుకొంది లోన సూర్యకాంతం చిరాగ్గాను. కాని, పున్నమ్మగారికేదో అనుమానం తగిలి, తదేకంగా అతన్నే చూస్తూ కూర్చుంది.

'ఇదిగోనమ్మా, నేనొక ప్రెస్సు కొన్నాను. దానికి మానేజర్ మన రమణబాబే! నెలకి వందరూపాయ లివ్వదలిచాను, అందాకా! ఆపైన వ్యాపారాభివృద్ధినిబట్టి పెంచుతాను. పైగా, వాడికి వర్కింగ్ పార్టనర్‌షిప్పూ ఇస్తున్నాను. అంటే - నష్టంతో సంబంధం లేకుండా సంవత్సరం సంవత్సరం లాభాల్లో వాటా కూడా ఇస్తానన్నమాట! ఇంక వాడెక్కడికీ కదలక ఇక్కడే, ఇంకా కావాలంటే మీ ఇంట్లోనే కాపురం వుంటాడు. మీ అమ్మాయిని వాడికివ్వడానికి ఇంత చాలునా? లేక—' పున్నమ్మగారికళ్లనుండి ఏకధారగా అశ్రువులు రాలడంచూచి ఓక్షణం ఆగిపోయి, మరుక్షణంలోనే ఆమె ముఖకవళికలను చూచి అవి ఆనందాశ్రువులని తేల్చుకొని, తమాషాకొద్దీ గుప్తా, 'అయితే నీవేమిస్తావమ్మా ఇంతకీ?' అన్నాడు.

అక్కడ - సంతోషసాగరంలో కాళ్లు తేలిపోతూ వుంటే సూర్యకాంత, ప్రక్కనేవున్న వాలుకుర్చీలోకి వాలిపోయింది....

ఇక్కడ - పున్నమ్మగారు లేచినిల్చొని, 'ఈ ఈడు వాళ్లేమో అనుకొన్నాను గాని, నాయనా - ఇప్పటికి బాగా తెల్సింది మీ సంగతి! ఇదిగో - మీరడిగితే నా సర్వస్వమూ ఇచ్చెయ్యడానికి సిద్ధంగా వున్నాను!' అన్నది, మందహాసంతో.

ఆమెకు మిగిలినవి; తిండిగింజలు ఇచ్చేపాటి పొలం కొంతా, ఓ గేదె, ఆ పెంకుటిల్లు-అంతే! ఆ సంగతి తెలిసివున్న గుప్తా నవ్వి, 'ఇక ఈ మిగిలినవాటితో నీవే హాయిగా కాలక్షేపం చేయవమ్మా! మీ అందరల్లుళ్ల లాంటివాడుకాడు రమణబాబు, మిమ్మల్ని తినెయ్యడానికి తెలుసా?' అంటూ లేచాడు....

(తరువాయి 18వ పేజీలో)

(13వ పేజీ తరువాయి)

ఆరాత్రి పరమేశ్వరితో 'నేను చేసింది, నేను చేయగలదానిలో ఎన్నోవంతంటావ్! అరె - ఈ మాత్రం దానికే, ఎంతమంది ఎంత సంతోషిస్తున్నారు!...కాని, ఈమాత్రం చేయడానికికూడా తెగించలేకపోవడంవల్లనే కదూ ఇంతకాలం ఇంత అధమ జీవితం గడపాం? మనలో ఎంత అజ్ఞానం, భీరుత్వం వుందో; వాటిని తొలగించుకొంటున్నకొద్దీ ఎంతెంత ఘనకార్యాలు చేయగలమో నేటికిగాని గుర్తించలేకపోయాను-ఇక చూద్దువుగాని—' అన్నాడు గుప్తా నుహోల్లాసంగా.

ఆమె భర్తని సగర్వంగా చూచింది, ప్రేమతో ప్రక్కన చేరింది. 'మీరొత్తి అమాయకులూ, అల్పసంతోషులూ! నిజానికి మీరిప్పుడు ప్రదర్శించినదాన్ని సాహసం అనండి, త్యాగమనండి, ఔదార్యమో లేక, మరేదో ఒకటనండి—అది ఏదైనాసరే, మనం అనుకొంటున్నంత తేలికైనదిమాత్రం కాదనే నేను చెప్తాను. ఈ కలిమి లేములమధ్య బయలుదేరిన సంఘర్షణ లోకాన్ని చివరికి ఘోరసంగ్రామంలోకి దించబోతోంది. గెలుపు ఓటులు ఎవరెవరన్నది అనవసరం-కాని, ఆ రణమే సంభవించితే ఇరుపక్షాలకీ సర్వనాశనం తప్పదల్లే కన్పిస్తోంది. అటువంటి మారణహోమం జరుగకుండాచేసి అందరూ కలిసి మెలిసి హాయిగా జీవింపజేయగల 'సంధి' అవసరం ఇప్పుడెంతైనా వుంది! ఆ 'సంధి'ని నిర్వహించి జయప్రదం చేయడానికి అప్పుడే కొందరు సహృదయులు పూనుకొన్నారనీ, అట్టివారిలో మీరూ ఒకరని నేను భావిస్తున్నాను! అటువంటి ఘనులను భర్తగా పొందిన నా జన్మ నిజంగా ధన్యమైందనే గర్విస్తున్నాను.' అంటూ చెప్పుకుపోతూవున్న భార్యని కదిపి, 'ఏమిటీధోరణి?' అన్నాడు గుప్తా, నవ్వుతూ. పరమేశ్వరి తేరుకొని మందహాసంతో, 'ఆనందంతో కలిగిన ఆవేశం; ఉత్సాహంతో కూడిన మెమరుపు-అంతే, భయపడకండి!' అని అతని గుండెలపైకి వాలిపోయింది.

# రచయితలకు మనవి

యథాప్రకారం కథాంజలి దీపావళి సంచిక అక్టోబరు 30వ తేదీన వెలువడబోతుంది. కథాంజలి పత్రిక పుట్టిన నాటినుంచి ఇన్నేళ్ళవరకు తన ఆశయాలను ఎంతవరకు నెరవేర్చుకుందో మీకందరకూ తెలుసు.

సంఘంలో ఉన్న చీడపురుగులను కథాంజలి తన రచనలతో తొలగించడానికి నడుంకట్టింది; తొలగించ కలుగుతోంది. కూడా.

ఈ సంవత్సరం వెలువడుతున్న దీపావళి సంచిక వినూత్న ఆకార ఆశయాలతో అలంకరించబడతోంది, ఈ ప్రయత్నంలో రచయితలైన మీ సహకారం ఎంతో అవసరం. కథాంజలి ఏ ఆశయాంతో పుట్టిందో ఆ ఆశయాలు ప్రతిబింబించే రచనలను సాగించి అలంకరించే బాధ్యత మీ మీదనే ఉంది.

అందుచేత చక్కని అధునాతన స్వతంత్ర రచనలను అచ్చులో మూడు పేజీలు మించకుండేటట్లు వ్రాసి 1-10-59వ తేదీలోగా మా కార్యాలయం చేరేటట్లు పంపండి.

ఈ సంచికలో ఎక్కువ రచనలు ప్రకటించాలని చూస్తున్నాను. అచ్చులో మూడు పేజీలకు సరిపడేటట్లు రచనలను సాగించినట్లయితే రచనల సంఖ్య ఎక్కువగా ఉంచడానికి వీలౌతుంది. ఈ నియమాన్ని మాత్రం మీరు విధిగా పాటించాలని కోరుతున్నాను.

— సంపాదకుడు